Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 156 | శుక్రవారం 21 నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

IRS PUBLICATIONS

irspublications12@gmail.com



24 నుంచి

## ‘మీ కోసం.. రైతన్నా’

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్

**అమరావతి, సూర్యవాస్తవం**

వ్యవసాయంలో పంచ సూత్రాల విధానాన్ని అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు అనే పంచ సూత్రాలతో వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి రైతుకి, అతని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, రైతు సేవ కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో ఆయన గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ‘మీకోసం.. రైతన్నా’ పేరుతో ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకూ కార్యక్రమాలు నిర్వహిస్తూ.., పంచ సూత్రలపై రైతులతో పాటు పశుపోషకులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకందారులు, ఆక్వా, ఉద్యాన, పట్టు పరిశ్రమ రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో శిక్షణా కార్యశాలలు నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు వ్యవసాయ గిట్టుబాటు అయ్యేలా అధునిక పద్దతులతో పంటలకు మరింత విలువను జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. రైతు బజార్లలోను ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాలని సూచించారు.

## నాంపల్లి సీబీఐ కోర్టుకు వైఎస్ జగన్

- ఆరేళ్ల తర్వాత మళ్లీ హాజరు

**హైదరాబాద్ , సూర్య వాస్తవం:** అక్రమాస్తుల కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం నాంపల్లిలోని సిబిఐ కోర్టుకు హాజరయ్యారు. కోర్టు అనుమతితో ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్లివచ్చిన ఆయన వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. దీన్ని సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. అక్రమాస్తుల కేసులో 2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సిబిఐ వాదించింది. దీంతో, ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట జగన్ అటెండెన్స్ ఇచ్చారు. వ్యక్తిగత హాజరును న్యాయస్థానం రికార్డు చేశారు. కోర్టు ప్రక్రియ పూర్తి కావడంతో న్యాయవాదులతో కలిసి బయటకు వచ్చిన వైఎస్ జగన్ అక్కడి నుంచి నేరుగా లోటస్‌పాండ్‌లోని తన నివాసానికి వెళ్లారు. అక్కడ తన తల్లి విజయమ్మతో భేటీ అయ్యారు. సుమారు అరగంట తర్వాత లోటస్‌పాండ్ నుంచి తిరుగు పయనమయ్యారు. ఈ సందర్భంగా జగన్ తరఫు న్యాయవాది మీడియాతో మాట్లాడుతూ జగన్ హాజరును కోర్టు రికార్డు చేసిందని, మళ్లీ కోర్టుకు రావాల్సిన అవసరంలేదని తెలిపారు. జగన్ రాక నేపథ్యంలో గత అనుభవాల దృష్ట్యా పోలీసులు నాంపల్లి కోర్టు వద్ద భారీగా భద్రత ఏర్పాటు చేశారు. కోర్టుకు వచ్చే రెండు మార్గాలను తమ ఆధీనంలోకి

2లో



## పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ద్రౌపదిముర్ము

**తిరుపతి, సూర్యవాస్తవం:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల తిరుపతి, తిరుమల పర్యటనలో భాగంగా గురువారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. రోడ్డు మార్గంలో తిరుచానూరు వెళ్లి పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద వేదపండితులు పూర్ణకుంభతో ఆమెకు స్వాగతం పలికారు. రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర

2లో



ఛాయ్ రాస్తా

## లోగో ఆవిష్కరణ



**కుప్పం, సూర్యవాస్తవం:** డ్వాక్రా మహిళల కోసం నెలకొల్పనున్న ఛాయ్ రాస్తా అవుట్ లెట్ లోగోను కుప్పంలో నారా భువనేశ్వరి ఆవిష్కరించారు. కుప్పంలో గురువారం ఆమె రెండో రోజు పర్యటించారు. రుచి, శుచి, నాణ్యత ప్రధానంగా కార్పొరేట్ తరహాలో కుప్పం డెవలప్‌మెంట్ ఆథారిటీ (కడా) మద్దతుతో ముందుగా కుప్పంలో ఈ ఛారు రాస్తా అవుట్ లెట్ ప్రారంభించనున్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహా సంకల్పంలో భాగంగా ఈ పట్టణాన్ని ఓ రోల్ మోడల్‌గా నిలపనున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. మహిళలు వ్యాపారవేత్తలుగా మారేందుకు ఇదొక చక్కటి అవకాశమని ఛారు రాస్తా సిఇఒ మైకేల్ జోషి అన్నారు. కుప్పంతో పాటు చిత్తూరు, తిరుపతి, గుంటూరు జిల్లాల్లో త్వరలోనే ప్రారంభిస్తున్నట్టు ఛారు రాస్తా డైరెక్టర్స్ పోలుదాసు కిరణ్, ఒంటిపులి పూర్ణచంద్ర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై.. అమ్మవారి వైభవం

2లో



సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## నిఖత్ జరీన్ పసిడి పంచ్

- భారత్ ఖాతాలో ఐదో స్వర్ణాలు

**నోయిడా, సూర్యవాస్తవం:** భారత మహిళా బాక్సర్, హైదరాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో సత్తా చాటింది. గురువారం జరిగిన మహిళల 51కిలోల విభాగంలో ఫైనల్లో గెలిచి స్వర్ణ పతకంతో మెరిసింది. విశ్వవేదికపై తన పంచ్ పవర్ చూపించిన నిఖత్ దేశానికి మరో బంగారు పతకం అందించింది. వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో ప్రత్యర్థి గ్జువాన్ యూ గువో(చైనీస్ తైపీ)ను మట్టికరిపించి విజేతగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌లో తృటిలో పతకం చేజార్చుకున్న నిఖత్.. స్వదేశంలో జరుగుతున్న వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో తడాఖా చూపించింది. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్ నిఖత్.. ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తూ ఫైనల్ చేరింది. సెమీస్‌లో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ గనీవ గుల్సేవర్‌పై సంచలన విజయంతో టైటిల్ పోరుకు సిద్ధమైన నిఖత్ అదే ఉత్సాహంతో ఫైనల్లోనూ మెరిసింది. తనదైన దూకుడుతో చైనీస్ తైపీకి చెందిన గువో యూ గ్జువాన్‌ను చిత్తుగా ఓడించింది. మ్యాచ్ ఆసాంతం ఆధిపత్యం చెలాయించిన భారత బాక్సర్ 5-0తో విజేతగా నిలిచింది. ఈ క్రమంలో నలుగురు భారత బాక్సర్లు స్వర్ణ పతకాలతో మెరిశారు. 48 కిలోల విభాగంలో మీనాక్షి హుడా, ప్రీతి పవార్(54 కిలోలు), అరుంధతి (70 కిలోలు), నుపుర్ షోరాన్(84 కిలోలు) దేశానికి పసిడి పతకాలు సాధించారు.



# నాంపల్లి సీబీఐ కోర్టుకు జగన్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారు. న్యాయవాదులను మాత్రమే లోపలికి అనుమతించారు. వైసిపి నేత పేర్ని నాని, మరో ముగ్గురు నాయకులను కోర్టు ప్రధాన ద్వారం వద్దే నిలిపివేశారు. అంతకుముందు ఉదయం 11 గంటల సమయంలో ప్రత్యేక విమానంలో వైఎస్ జగన్, పలువురు వైసిపి నేతలు కలిసి బేగంపేట వియానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న వందలాది మంది వైసిపి కార్యకర్తలు, జగన్ అభిమానులు ఒక్కసారిగా విమానాశ్రయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని నియంత్రించే క్రమంలో పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జి చేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చాక వైఎస్ జగన్ కాన్వారుతో బయటకు వచ్చారు. అభిమానులకు అభివాదం చేస్తూ ఆయన ముందుకు కదిలారు. భారీ ర్యాలీగా నాంపల్లి సిబిఐ కోర్టు వద్దకు చేరుకున్నారు. దీంతో, ఆ రూట్లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న ద్రౌపదిముర్ము

(మొదటి పేజీ తరువాయి)

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారా యణరెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ అనీల్‌కుమార్ సింఘాల్, అనంతపురం రేంజి డిఐజి షిమోషి, కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎస్‌పి ఎల్ సుబ్బ రాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తదితరులు స్వాగతం పలికినవారిలో ఉన్నారు. అనంతరం తిరుమలకు రాష్ట్రపతి బయల్దేరి వచ్చారు. తిరుమలలోని పద్మావతి విశ్రాంతి గృహం వద్ద రాష్ట్రపతికి మంత్రి అనిత, టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు పనకబాక లక్ష్మి, జానకిదేవి, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శు క్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.

## పుట్టపర్తిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఘన స్వాగతం



**శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో, నవంబర్ 20 సూర్యవాస్తవం:** పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర రోడ్లు, రవాణా జాతీయ హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తికి విచ్చేశారు. ఆయన రాక సందర్భంగా పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. తరువాత కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశాంతి నిలయానికి చేరుకొని సాయికుల్వంత హాల్లో శ్రీ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్శనలో రాష్ట్ర మంత్రులు, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు కూడా పాల్గొన్నారు,కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో కలిసి పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, తరువాత శ్రీనివాస గెస్ట్ హౌస్‌లో, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సత్యసాయి జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారులు మరియు రాష్ట్ర రహదారుల అభివృద్ధి పనులపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవిత, ఎన్‌ఎచ్‌ఏఐ ఉన్నతాధికారులు, ఆర్‌అండ్‌బీ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## హనుమంత వాహనంపై

# పద్మావతి అమ్మవారి వైభవం

(మొదటి పేజీ తరువాయి)

తిరుచానూరు, సూర్య వాస్తవం: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీ పట్టాభిరాముని అలంకారంలో శ్రీ పద్మావతి అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. హనుమంతుడు శ్రీరామచంద్రునికి అనన్యభక్తుడు. త్రేతాయుగంలో శ్రీవారు శ్రీరాముడిగా అవతరించారు. ఆదిలక్ష్మి సీతగా మిథిలానగరంలో అవతరించి, స్వామిని వివాహమాడింది. భూదేవి అంశ అయిన వేదవతి కలియుగంలో పద్మావతిగా అవతరిం చింది. తన జాడను శ్రీవారికి తెలిపిన మహాభక్తుడైన ఆంజనేయుని కోరికను తీర్చడానికా అన్నట్టు అలమేలుమంగ బ్రహ్మోత్సవాలలో హనుమంతున్ని వాహనంగా చేసుకుంది. వాహనసేవలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జెఈఓ వి. వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు














# ఏపీ టెర్మినల్ ప్లాంట్ సమీక్షా సమావేశం

## • ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి





**ఎర్రగుంట్ల - సూర్య వాస్తవం, నవంబర్ 20:** కడప జిల్లా, ఎర్రగుంట్ల మండలం, కలమల ప్రాంతంలో ఉన్న ఏపీ టర్మినల్ ప్లాంట్ ( ఏ పి జి ఎన్ సి ఓ) పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో విస్తృత సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పి యూ సి చైర్మన్ కూన రవికుమార్ అధ్యక్షత వహించగా, కమిటీ సభ్యులు, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సహా అధికారులు పాల్గొన్నారు.

**విపులమైన చర్చలు సమగ్ర సమీక్ష :** ఈ సందర్భంగా కమిటీ సభ్యులు థర్మల్ ప్లాంట్ కార్యకలాపాలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, పంపిణీ వ్యవస్థ, సాంకేతిక ఆధునీకీకరణ, యూనిట్ల నిర్వహణ ఖర్చులు, పర్యావరణ ప్రమాణాలు, భద్రతా చర్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిపారు. ప్లాంట్ పనితీరు, మౌలిక వసతులు, భవిష్యత్ విస్తరణ అవకాశాలపై అధికారుల నుండి వివరాలు సేకరించారు.

**యూనిట్ సందర్శనలు - ప్రత్యక్ష పరిశీలన :** సమీక్షా సమావేశానికి ముందుగా కమిటీ సభ్యులు స్టేజి -ఐ వి 600 ఎం డబ్ల్యూ పవర్ యూనిట్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, బాయిలర్ సెక్షన్, కంట్రోల్ రూమ్ వంటి కీలక విభాగాలను సందర్శించారు. అక్కడి సాంకేతిక నిపుణులు విద్యుత్ ఉత్పత్తి విధానం, నిర్వహణ చర్యలు, తాజా అప్‌గ్రేడేషన్‌లపై సమగ్ర వివరాలు అందించారు. **చరిత్రలో నిలిచిపోయిన ఎన్టీఆర్ పథకం:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 1988లో ఈ ప్లాంట్ నిర్మాణానికి పునాది వేసిన సందర్భాన్ని గుర్తుచేస్తూ, ఆ సందర్భంలో ఏర్పాటు చేసిన ప్రారంభ పైలన్‌ను కమిటీ సభ్యులు పరిశీలించారు. రాష్ట్ర విద్యుత్ రంగ అభివృద్ధి చరిత్రలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించినదని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి వివరించారు.

**ప్లాంట్ అభివృద్ధికి సూచనలు :** విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం, ఆధునిక పరికరాల వినియోగం, కొత్త సాంకేతికత ప్రవేశపెట్టడం, పర్యావరణ పరిరక్షణకు అనుసరించవలసిన చర్యలు వంటి అంశాలపై కమిటీ సభ్యులు సూచనలు చేశారు. ప్రజలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ప్లాంట్ కార్యకలాపాలు మరింత బలోపేతం కావాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన







**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, నవంబర్ 20:** అన్నమయ్య జిల్లా రాయచోటి లోని శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో గురువారం నాడు ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ ఏఎన్ఆర్ పై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఆసుపత్రి చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి. లక్ష్మీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ బి. కిరణ్ కుమార్, డాక్టర్ వెంకట శివ విద్యార్థులకు ఏఎంఆర్ యొక్క గ్లోబల్ ప్రభావం, యాంటీబయాటిక్స్ దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, నివారణ చర్యలపై విశ్లేషణాత్మకంగా అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథి డా.లక్ష్మీ ప్రసాద్ అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. యాంట ీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌కు దారితీసే ప్రధాన కారణాలు, యాంటీబయాటిక్స్‌ను తప్పుడు రీతిలో వినియోగించడం వల్ల కలిగే హానికర ప్రభావాలు, డాక్టర్ సూచించిన మందులను పూర్తిగా వాడాల్సిన అవసరం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానాల ప్రాధాన్యం అంశాలను వివరించారు. ఏఎమ్ఆర్ నియంత్రణలో యువతపాత్ర ఎంతో ముఖ్యమన్నారు. డా.బి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ మెడికల్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత పెరుగుతూ ఉండటంతో, ఇంజనీరింగ్ విద్యార్థులు ఆరోగ్య రంగానికి మరింత మద్దతు అందించగలరని అన్నారు. ఏఎంఆర్ ఆధారిత పరిశ్రమల వల్ల మెడికల్ రంగంలో మెరుగైన ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చిన్న అనారోగ్య సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా అర్హత ఉన్న వైద్యులను సంప్రదించాలి అని సూచించారు. యాంటీబయాటిక్స్ బాధ్యతాయుత వినియోగం, వైద్యుల సూచనలను ఖచ్చితంగా పాటించడం, ఏ ఏం అర్ పై సమాజంలో అవగాహన కల్పించడం యువత కర్తవ్యమని అన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులతో ఏఏంఅర్ నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి హాజరైన వైద్య నిపుణులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, ఎన్ ఎస్ఎస్ ఆఫీసర్ కె.రెడ్డయ్య, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఏ ఏం ఆర్ యొక్క తీవ్రతపై అవగాహన పెరగడమే కాక, దాని నివారణకు సమాజం మొత్తం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని స్పష్టమైన సందేశంగా అందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం

## • పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బిటెక్ రవి





**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 20:** పులివెందుల టీడీపీ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బిటెక్ రవి నిర్వహించారు. వాటిలో భాగంగా ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా విని, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ ప్రజల నమ్మకానికి నిలబడటం, వారికి అందుబాటులో ఉండి వేగంగా స్పందించడం ప్రజాప్రతినిధిగా నా కర్తవ్యమని భావిస్తూ, ప్రతి పిటిషన్‌ను అత్యంత బాధ్యతతో స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నమని బిటెక్ రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పంటలు ఎండగాలి పోయాక నీళ్లు వదులుతారా

**- సిబిఆర్ నుండి కుడి, ఎడమ కాలువలకు దిగువ వరకు నీళ్లు వదలాలి**

**- వెంటనే కాలవలకు నీళ్లు వదలాలి వైకాపా నాయకులు డిమాండ్**



**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 20:** సిబిఆర్ నుండి రైతులకు కుడి, ఎడమ కాలువలకు నీళ్లు వదలాలని, వర్షాలు లేక పంటలు ఎండగాలి పోతున్నాయని, ఇప్పటికే ఉద్దిపంట పూర్తిగా దెబ్బ తినిందని వైకాపా నాయకులు మాజీ చైర్మన్ రసూల్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్ రెడ్డి, నీలకంఠేశ్వర్ రెడ్డి, గంగిరెడ్డి, ఎల్లారెడ్డి, రఘురాం రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ సిబిఆర్ నుండి కుడి ఎడమ కాలువలకు వెంటనే ప్రభుత్వం నీళ్లు వదలాలని వారు డిమాండ్ చేశారు. అతివృష్టి అనావృష్టి వలన పంటలు పండినప్పటికీ గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పుడున్న పంటలకు నీళ్లు తక్కువై పంటలు వాడు దశలో ఉన్నాయనిసిబిఆర్ నుండి కుడి ఎడమ కాలవలకు నీళ్లు వదలాలన్నారు. రెండు సంవత్సరాల నుండి పంటలు పడక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు అన్నారు. వెంటనే పి బిసి అధికారులు వెంటనే స్పందించి కాలవలకు నీళ్లు విడుదల చేయాలన్నారు.

## గండి ఆంజనేయ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు




**చక్రాయపేట - సూర్య వాస్తవం, నవంబర్ 20:** చక్రాయ పేట మండలం శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం గండి క్షేత్రంలో 21 వ తేదీన శుక్రవారం ఉదయం 8 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం కడప దేవాదాయశాఖ అధికారి మండల రెవెన్యూ అధికారి మరియు ఆర్కే ర్యాలీ పోలీసులు, ఆలయ ధర్మకర్త మండలి వారి సమక్షంలో తెరిచి లెక్కించుటకు నిర్ణయించడం అయినదని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి జె.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సదరు కార్యక్రమంలో పాల్గొనుటకు ఆసక్తి గల భక్తాదులు దోవతీ, పంచ ధరించి ఎటువంటి విలువైన బంగారు, వెండి ఆభరణములు ధరించకుండా పాల్గొన వలయునని తెలియజేశారు.

## నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్‌కు పోటీపడే విద్యార్థులకు అద్భుత అవకాశం

**- వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్‌లో**

**జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు నమూనా పరీక్ష**

**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 20:** విద్య, విలువలు, విశ్వసనీయతలే పునాదిగా ఆవిర్భవించిన వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయుల సమస్యలకు సకాలంలో స్పందిస్తూ,వాటి సత్వర పరిష్కారానికై చొరవ చూపుతూ, అనతి కాలంలోనే అందరి ఆదరాభిమానాలను చూరగొన్న విషయం అందరికీ తెలిసిందే. ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడడంలో రాజీలేని పోరాటం సాగిస్తున్న అసోసియేషన్... ఉపాధ్యాయుల ట్రాన్స్ఫర్స్,ఐటీ రిటర్న్స్ వంటి సందర్భాలలో ఉపాధ్యాయులకు సదా అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు, సాంకేతిక సహకారం అందిస్తున్న సంగతి తెలియంది కాదు. చదువులో చురుగ్గా ఉండి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యార్థి నేస్తంగానూ వెలుగొందుతోంది వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి జాతీయ ఉపకార వేతనాల పరీక్ష ఎన్ఎమ్ఎమ్ఎస్ రాసే 8 వ తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించడం ద్వారా అద్భుత అవకాశాన్ని కల్పిస్తోంది. ఎన్ ఎం ఎం ఎస్ ఆశావహులకు ఎంతగానో ఉపకరించే ఈ నియోజకవర్గస్థాయి పరీక్ష వివరాలు ఇవే.

**పరీక్ష తేదీ:** 30 వ తేది ఆదివారం **సమయం:** ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు **వేదిక:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్), అహోబిలాపురం, పులివెందుల. ఒక్కో పాఠశాల నుంచి ఎంతమంది విద్యార్థులైనా పాల్గొనవచ్చు. అందరికీ మధ్యాహ్నం భోజనం ఉంటుంది. భోజనం పిదప ఫలితాలు ప్రకటించి, బహుమతులు అందజేయబడతాయి. ప్రథమ బహుమతి: రూ.5000. ద్వితీయ బహుమతి: రూ.3000. తృతీయ బహుమతి : రూ.2000. ఒక్కొక్కరికి 500 రూపాయలు చొప్పున 10 మందికి కన్సిలేషన్ బహుమతులు ఉంటాయి. పులివెందుల నియోజకవర్గంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది విద్యార్థులను ఈ పరీక్షకు సన్నద్ధం చేసి ఎక్కువ మంది విద్యార్థులను తీసుకురావలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 9885560568, 8639345661, 8978011171, 9014998879, 8074158249 వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్, పులివెందుల డివిజన్.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## స్వదేశీ వస్తువులు వాడాలని వివరించిన బీజేపీ నాయకులు



**వేంపల్లి - సూర్య వాస్తవం, నవంబర్ 20:** కడప జిల్లా వాణిజ్య సెల్ అధ్యక్షుడు దంతు సుమన్ స్వదేశీ నినాదంతో గురువారం వేంపల్లి పట్టణంలోని రాజీవ్ కాలనీ లో ఉన్న కార్మికులకు మరియు ప్రజలకు స్వదేశీ వస్తువులు వాడాలని వివరించడం జరిగింది మరియు మన జీవితంలో పండగ ఏదైనా మనం మర్చిపోకూడని పదం స్వదేశీ వస్త్రాలంకరణ, బహుమతులు ఈ దేశంలో తయారయ్యే వాటికే ప్రాధాన్యం ఇవ్వాలని కోరడమైనది. ఇలాంటి ఈ కార్యక్రమంలో కడప జిల్లా బిజెపి వాణిజ్య సెల్ అధ్యక్షుడు దొంతు సుమన్, బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగిశెట్టి సునీల్ కుమార్ పాల్గొనడం జరిగింది.

## అంతర్జాతీయ అబాకస్ 8 వ స్థాయి పోటీలలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన పూజ



**కదిరి - సూర్య వాస్తవం, నవంబర్ 20:** ఈ నెల 16 న చెన్నై ట్రేడ్ సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్ పోటీలలో కదిరికి చెందిన నల్లమారి రాజా, శశికళ దంపతుల కుమార్తె పూజ మూడవ స్థాయిలో నిలిచి అవార్డును, ప్రశంసా పత్రాన్ని గెలుచుకుంది. ఈ అంతర్జాతీయ అబాకస్ పోటీలలో మొత్తం 15 దేశాలకు చెందిన 8000 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు.అబాకస్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఎస్ఐపి సంస్థను నిర్వహిస్తున్న మాధవి, కేదార్ దంపతుల ఆధ్వర్యంలో చెన్నైలో నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్ పోటీలకు హాజరై కదిరి విద్యార్థినులు అత్యున్నత ప్రతిభ చూపారు. గతంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలలో కూడా కదిరికి చెందిన నల్లమారి పూజ రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకొని ఛాంపియన్‌గా అవార్డును జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందుకుంది. ఇదే వేదికగా నిర్వహించిన మరొక అబాకస్ పోటీలలో మూడవ అవార్డు గెలుచుకున్న పూజ సోదరి నల్లమారి భార్గవి కూడా 4 వ స్థాయి అబాకస్ పోటీ ఫలితాలలో నాలుగవ స్థానం సాధించింది. కదిరి ప్రాంతానికి చెందిన విద్యార్థినిలు అత్యున్నత స్థాయిలో అవార్డులు సాధించడంతో తల్లిదండ్రులు, స్నేహితులు, హర్షం వ్యక్తం చేశారు.

## బ్యాడ్మింటన్‌లో వేదవ్యాస విద్యార్థికి రజతం



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం, నవంబర్ 20:** కడప వైవియూ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన బద్వేలు బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కాలేజిలో జరిగిన అంతర్‌కళాశాలల బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీలలో ప్రొద్దుటూరు లోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కళాశాల తొలి సంవత్సరం విద్యార్థి పి.భరత్ రాజేశ్ రెండో బహుమతి సాధించాడు. విజేతగా నిలిచిన ఆయనకు రజత పతకం, సర్టిఫికేట్, అలాగే రూ. 500 నగదు బహుమతి లభించాయి. ఈ విజయాన్ని కళాశాల కరస్పాండెంట్ యల్. నాగేశ్వరరెడ్డి అభినందించారు. భరత్ రానున్న రోజుల్లో రాష్ట్రస్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభను అభినందిస్తూ కళాశాల ప్రెసిడెంట్ జి. సుదర్శన రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ కె. నాగరాజ, వి.రామలక్ష్మిరెడ్డి, ఎస్. పి. యాసిన్, అలాగే అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# సాయినాధునికి విశేష పూజలు

**• ఆలయ ప్రాంగణం దీపాలంకరణ**

**• ఆలయ అభివృద్ధికి సహకరించండి : చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య**

**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 20:** పులివెందుల పట్టణం పార్నపల్లి రోడ్డు మొట్టమొదటగా కొలువైయున్న షిరిడి సాయిబాబా ఆలయంలో కార్తీకమాసం లాస్ట్ గురువారం షిరిడి సాయినాధునికి విశేష పూజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణం దీపాలంకరణలతో మొ క్కులు చెల్లించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో ఉభయదారులచే తెల్లవారుజామున నుండి షిరిడి సాయినాధునికి కాకడ హారతి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, తదితర పూజ కైంకర్యాల అనంతరం షిరిడి సాయినాధుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఈ కార్తీకమాసంలో ప్రతిరోజ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉదయము



సాయంకాలము దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దీవెనలు అందుకుంటున్నారని, అన్నదాన కార్యక్రమాలకు భక్తులు ఎవరైనా వస్తురూపమైన ధన రూపేనా సహాయం చేయదలచిన వారు ఆలయంలో సంప్రదించవలెనని తెలిపారు.

**ఆలయ అభివృద్ధికి సహకరించండి:** ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా పథకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించండి

**• డిసెంబర్ 1 న చలో నంద్యాల ర్యాలీని విజయవంతం చేయండి**

**• ఎమ్ఐవి కార్మిక సంఘం అధ్యక్షుడు ఇమామ్ భాష**

**పులివెందుల - సూర్య వాస్తవం, నవంబర్ 20:** దేశంలో 20 కోట్లకు పైగా జనాభా కలిగిన ముస్లింలు సామాజిక రాజకీయ చైతన్యాలు కొరవడి విద్యాపరంగానూ ఆర్థికంగానూ వెనుకబడి వున్నారని అధికశాతం ముస్లింలు కాలుష్యంతో కూడిన మురికివాడల్లో నివసిస్తున్నారని ముస్లిం ఐక్యవేది కార్మిక సంగం అధ్యక్షుడు ఇమామ్ భాష పేర్కొన్నారు.యూపిఏ ప్రభుత్వ హయాంలో ముస్లింల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం కోసం నియమించబడిన జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ నివేదికలో ముస్లింలు ఎస్సీ ఎస్టీల కన్నా దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నట్లుగా పేర్కొన్నారు అలాగే రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక సైతం ముస్లింల సామాజిక వెనుకబాటుతనాన్ని వెల్లడిస్తూ వారికి మెరుగైన జీవితాన్ని అందించేందుకు పలు సూచనలు చేసింది కానీ ఎన్ని కమిషన్లు వేసినా నివేదిక వచ్చిన ముస్లింల జీవన స్థితిగతుల్లో చెప్పుకోదగ్గ మార్పు రాలేదన్నది వాస్తవం. ముస్లింల అభివృద్ధి సంక్షేమాలకోసం ఏదైనా పథకాన్ని రూపొందిస్తే మైనార్టీ బుజ్జగింపు పథకాలు అంటూ వాటికి రాజకీయ రంగుని పులుముతున్నారు గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని 2004 ఎన్నికలకు ముందు ప్రకటిస్తే ఏకంగా టిడిపి పార్టీ 2004 ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగమేఘాల మీద 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని ప్రకటన చేశారు జి ఓ విడుదల చేయడం జరిగింది కానీ మెజార్టీ ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా ఆనాడు అసెంబ్లీలో ముస్లింలకు రిజర్వేషన్లు బిల్లు పెట్టి పాస్ చేసి కేంద్రానికి పంపి బిల్లును పార్లమెంటులో అప్పటి



కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు ఆమోదం పొంది ఉండాలి కాని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం జి ఓ. రిలీజ్ చేసి ముస్లింలను మోసగించారు. ఆనాడు టిడిపి పార్టీ తరపున మ్యానిఫెస్టోలో ప్రకటించిన రిజర్వేషన్లు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఆనాడు ముస్లింలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వాటికి వ్యతిరేకంగా కేసు వేసి అవి నాలుగు శాతానికి దిగేలా చేశారు వీటిని కూడా రద్దు చేయించడానికి నిరంతరం ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి కొన్ని రాజకీయ పార్టీలు మైనార్టీల ఓటు బ్యాంకును ఎప్పటికీ తమ గుప్పెట్లో ఉంచుకోవడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తూంటే మరికొన్ని పార్టీలు హిందువులను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి ఓట్లు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే కొన్ని పార్టీలు ముస్లిం పేర్లతో పార్టీలు నడుపుతూ మొత్తం ఓటు బ్యాంకును తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి అయితే ముస్లింలు రాజకీయ పార్టీల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి ఏ ఒక్క పార్టీకి వారు ఓటు బ్యాంకుగా మారకుండా జాగ్రతలు పాటించాలి. అదే సమయంలో ముస్లిం ఓటు బ్యాంకును మతతత్వ శక్తులకు లాభం చేకూర్చే విధంగా కూడా ప్రతి ఎన్నికల సమయంలోనూ ముస్లిం సమాజానికి రిజర్వేషన్లు కల్పిస్తామని. దామాషా ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయిస్తామని ముస్లింలకు నమ్మలేని నిజాలు చెప్పి ఓట్లు వేయించుకుని పబ్బం గడుపుకునే విధంగా పార్టీలు ముస్లిం మత పెద్దలను ముస్లిం నాయకులను తీసుకుని వచ్చి ఓట్లు వేయించుకుని పబ్బం గడుపుకునే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి ముస్లిం సమాజం మేలుకో ముస్లింలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాడాలి. అలాగే పార్టీలలో ఉన్న ముస్లిం మైనార్టీ నాయకులు అధికార అనధికార పార్టీలలో ఉన్న ముస్లిం నాయకులు వారివారి పార్టీ అధ్యక్షులకు వత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదం పొంది కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ముస్లింలకు రిజర్వేషన్లు అలాగే రాజకీయ రిజర్వేషన్లు ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన విధంగా వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న ముస్లిం నాయకులు ఒత్తిడి తెచ్చి రాజకీయ రిజర్వేషన్లు సాధించే విధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిసెంబరు 1వ తేదీ చేపట్టే ముస్లిం ఐక్యవేదిక శాంతి యుత పాదయాత్రకు మద్దతుగా ర్యాలీని విజయవంతం చేయాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్మిక సంఘ విభాగం అధ్యక్షుడు షేక్ హిమాంబాషా విన్నపం చేశారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు మాటల్లో వాస్తవం లేదు

**• కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**

**వేంపల్లి - సూర్యవాస్తవం, నవంబర్ 20:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని బుధవారం కడప జిల్లా పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడంలో ఏ మాత్రం వాస్తవం లేదని, ఇవి పచ్చి అబద్దాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లి లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సూపర్ 6 హామీల లో భాగంగా 17 నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతి నెలకు 3000 రూపాయలు ఇవ్వలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వలేదన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా కనిపిస్తూ ఉంటే ముఖ్యమంత్రి సూపర్ స్టిక్స్ హామీలు



సూపర్ హిట్ అయ్యాయని, ఎన్నికల హామీలను అన్నిటిని అమలు చేశామని చెప్పడం విడ్డూరం కాక మరేమిటి అని తులసి రెడ్డి ప్రశ్నించారు. కూటమి పాలనలో రైతుల పరిస్థితి కడు దయనీయంగా ఉంది. ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. మిర్చి, పొగాకు, అరటి, చీని, టమోటో, ఉల్లి, పూలు , పసుపు ఇలా ఏ పంటను అడిగేవాడు లేడు ,కొనేవాడు లేడు. సున్నా వడ్డీ పథకానికి సున్నం పెట్టడం జరిగింది . పావలా వడ్డీ పథకానికి పాడే కట్టడం జరిగింది. యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయలు ప్రతి రైతుకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి అందులో 6000 కోత పెట్టింది. లబ్ధిదారుల సంఖ్యలో 7 లక్షల కోత పెట్టింది. ఆ ఇచ్చేది కూడా మూడు కంతుల్లో .అది కూడా కౌలు రైతులకు ఇవ్వడం లేదు .కానీ ప్రభుత్వమేమో అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల ఆర్థిక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పడం హాస్యాస్పదమని తులసి రెడ్డి అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వట్టి మాటలు తగ్గించి, రైతులకు, ప్రజలకు, సమాజంలోని వివిధ వర్గాల వారికి న్యాయం చేయాలని తులసి రెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

# అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ ఓ అద్భుతం

- శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి కితాబు
- పసికందుల ఆకలి తీర్చడం దైవకార్యంతో సమానం
- ఇక్కడ పని చేయడాన్ని ఉద్యోగులు అదృష్టంగా భావించాలి




**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం, నవంబర్ 20 :** అనంత మిల్క్ బ్యాంక్ సేవలు ఓ అద్భుతమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కితాబునిచ్చారు. అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఏర్పాటు చేసిన అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ ను గురువారం ఆమె సందర్శించారు. ఇక్కడ లభిస్తున్న సేవలను ఆమె అడిగి తెలుసుకున్నారు. మదర్స్ మిల్క్ బ్యాంక్ కు వచ్చిన తల్లులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో మొత్తం మూడు మిల్క్ బ్యాంక్ లు(అనంతపురం, తిరుపతి, కాకినాడ)లో ఉండగా అనంతపురంలో ఆర్నెల్ల కిందట ఏర్పాటు చేసిన మిల్క్ బ్యాంక్ కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని తెలిసి సంతోషపడ్డారు.

మదర్స్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు ఆవశ్యకతను తల్లులకు వివరించి, వారిని చైతన్యవంతులను చేసి ఎక్కువ లీటర్ల పాలు సేకరణకు కృషి చేస్తున్న ఆర్.ఎం.ఓ డాక్టర్ గుజ్జల హేమలత, సిబ్బందిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రశంసించారు. ఇప్పటి వరకు ఎంత పాలు సేకరించారు, ఎంతమంది తల్లులు పాలు ఇచ్చారు, ఎక్కువ పాలు ఇచ్చిన తల్లులు ఎంతమంది, వారి పేర్లు అడిగి తీసుకున్నారు. పాలు ఇచ్చి సహకరించిన మాతృమూర్తులందరికీ ఎమ్మెల్యే శ్రావణి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా పాలు ఇస్తామని ముందుకు వచ్చే తల్లుల వద్దకే వారి స్వగ్రామాలకు వెళ్లి పాలు సేకరించి తీసుకురావడం గర్వంగా ఉందన్నారు. మిల్క్ బ్యాంక్ లో పని చేసే అదృష్టం అందరికీ రాదని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు ఈ విషయాన్ని గుర్తించి మరింత బాధ్యతగా పని చేయాలని కోరారు. పసి కందులకు సేవలదించడం అంటే దేవునికి సేవ చేయడమేనని, ఈ విషయాన్ని గుర్తించి మరింత సమర్థవంతంగా పనిచేయాలని సిబ్బందిని కోరారు. మదర్స్ మిల్క్ బ్యాంక్ కు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. మాతా శిశువుల ఆరోగ్యానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వపరంగా కూడా అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్ కు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## దివ్యాంగుల అలింకో

# ఉపకరణాల వైద్యశిబిరం విజయవంతం

- ఉపకరణం - దివ్యాంగుల స్వతంత్ర జీవితానికి వరం
- సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ రమణమూర్తి





**పులివెందుల – సూర్య వాస్తవం, నవంబర్ 20:** అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు కృత్రిమఅవయవాలు, త్రిచక్ర వాహనాలు, శ్రవణయంత్రాలు తదితర సహాయ ఉపకరణాలు వరం లాంటివని, ఒక ప్రదేశం నుండి మరోప్రదేశానికి సంచరించడానికి, ఇతరులతో కమ్యూనికేషన్ కొరకు, తమదైనందిన జీవిత వ్యవహారాలు నెరవేర్చుకునేందుకు సహాయ ఉపకరణాలు ఎంతో ఆసరాగా నిలుస్తాయని, ముఖ్యంగా పాఠశాలస్థాయి విద్యార్థులకు ఇతర విద్యార్థులతో సమానంగా విద్యనార్జించే%శీ%దుకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయని, ప్రతి విభిన్నప్రతిభావంతుడైన విద్యార్థి ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నత విద్యకు చేరుకోవాలని సమగ్ర శిక్ష, సహిత విద్యావిభాగం కడప జిల్లా కోఆర్డినేటర్ రమణమూర్తి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారి సంస్థ (అలి%శీ%కో ) సహకారంతో సమగ్ర శిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో పులివెందుల పట్టణంలోని రమణప్పసత్రం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సహాయ పరికరాల నిర్ధారణ శిబిరానికి అధ్యక్షత వహించిన రమణమూర్తి, మండల విద్యాశాఖ అధికారులతో కలిసి మెడికల్ క్యాంపును ప్రారంభించారు.లిఅలి%శీ%కో కాన్పూర్ కు చెందిన వైద్య నిపుణులు దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన సహాయ పరికరాలకు అర్హులైన వారిని గుర్తించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హులైన దివ్యాంగులకు అతి త్వరలో సహాయ పరికరాల పంపిణీ శిబిరం ఏర్పాటు చేసి ఉపకరణాలను అందజేస్తామని వారు పేర్కొన్నారు. ఈవైద్యశిబిరానికి పులివెందుల నియోజకవర్గ%శీ%లోని ఏడు మండలాల పరిధిలోని 200 మందికి పైగా, పాఠశాల విద్యార్థులయిన దివ్యాంగులు, వారికి విద్యాబోధన చేస్తున్న భవిత స్కూల్ రిసోర్స్ టీచర్లు( ఐఈ ఆర్పిలు) హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అలింకో సంస్థ వైద్యనిపుణులు, సమగ్ర శిక్ష సహితవిద్య జిల్లా కోఆర్డినేటర్ రమణమూర్తి, పులివెందుల మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖరరావు, రామానాయుడు, దివ్యాంగుల ప్రత్యేక విద్యా సహాయకులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, సమగ్ర శిక్ష సిబ్బంది మమత, నరసయ్య, వివిధ మండలాల సహిత విద్యా రిసోర్స్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# స్వామిత్వపై గ్రామసభ నిర్వహణ



**వేంపల్లి – సూర్య వాస్తవం, నవంబర్ 20:** వేంపల్లి మండలం అలవలపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని అలవలపాడు, చెర్లోపల్లి గ్రామాల్లో స్వామిత్వ ఎస్ వి ఏ ఎం ఐ టీవీ ఏ పథకానికి సంబంధించి గురువారం గ్రామసభను సజావుగా నిర్వహించారు. స్వామిత్వ కార్యక్రమం కింద గ్రామకంఠంలోని గృహ నిర్మాణ స్థలాల పరిమాణాలు, భూసర్వే, మ్యాపింగ్, డ్రోన్ సర్వే వివరాలు, అలాగే ప్రతి కుటుంబానికి జారీ చేయబడే ప్రాపర్టీ కార్డుల అవసరం మరియు ప్రాధాన్యతపై అధికారులు గ్రామస్తులకు సమగ్ర అవగాహన కల్పించారు. వేంపల్లి ఎంపీడీఓ కె. కుళ్లాయమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ రాంమోహన్ రెడ్డి, మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల అబాది ఆస్తులపై స్పష్టమైన యాజమాన్యాన్ని స్థాపించడం వైపు స్వామిత్వ పథకం ఒక సంస్కరణాత్మక అడుగు" అని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా గ్రామ భూభాగాన్ని ఖచ్చితంగా మ్యాప్ చేసి, ప్రతి గృహ యజమానికి 'హక్కుల రికార్డు' అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా గ్రామస్తులకు చట్టబద్ధమైన యాజమాన్య కార్డులు ఆస్తి కార్డులు– టైటిల్ డీడ్‌లు జారీ చేయబడతాయని వివరించారు. గ్రామస్థుల నుండి వచ్చిన అభ్యంతరాలు, సవరణలు, సరిహద్దుల స్పష్టీకరణలాంటి అంశాలను గ్రామసభలో స్వీకరించి సంబంధిత అధికారులకు చేరవేశారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి వివాదాలు లేకుండా పూర్తిచేయడానికి గ్రామస్తులు సహకరించాలని అధికారులు కోరారు. స్వామిత్వ పథకం గ్రామ ఆస్తులపై స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యం అని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.నాగార్జున, సర్పంచ్ జి.లక్షుమ్మ, ఎంపీటీసీ జి.రావణమ్మ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్

## మెగా ఉచిత వైద్య శిబిరం



**గాండ్లపెంట – సూర్య వాస్తవం, నవంబర్ 20:** మండల కేంద్రంలోని హై స్కూల్ దగ్గర ఎస్ ఆర్ బిల్డింగ్ నందు గురువారం సర్పంచులు షేక్ రహంతుల్లా సీఎన్ఏ సుధాకర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్య సేవ ఆధ్వర్యంలోఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి వైద్య బృందం విచ్చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి 140 మంది ఓపి రసీదులు పొంది ,అందులో 15 మందిని వారి వారి ఆరోగ్య సమస్యలు రీత్యా తిరుపతికి తీసుకు వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచులు షేక్ రహంతుల్లా శ్రీఎన్ఏ సుధాకర్, రమాదేవి సూపర్ స్పెషాలిటీ వారి వైద్య బృందం డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ ఎల్లయ్య, నర్సులు పవిత్ర, మునియమ్మ, రాశి పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండాలి

**- పులివెందుల అర్బన్ సిఐ సీతారాం రెడ్డి**



**పులివెందుల – సూర్య వాస్తవం, నవంబర్ 20:** సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పులివెందుల అర్బన్ సీఐ సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం పులివెందులలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్ నందు అర్బన్ సీఐ సీతారాం రెడ్డి ఆధ్వర్యంలో మొబైల్ వాడకం, సైబర్ క్రైమ్, వాట్సప్, ఇంస్టాగ్రామ్ తదితర వాటి వలన సాంకేతిక పరిజ్ఞానంతో ఏ మేరకు ప్రయోజనాలు ఉన్నాయో అంతే మేర దుష్ప్రయోజనాలు కూడా కలవని వీటిని విద్యార్థులు అవగాహన చేసుకుని ముందుకెళ్లాలని, మీ వ్యక్తిగత వివరాలను, బ్యాంక్ ఖాతా వివరాలను, ఆధార్ నెంబర్, పాస్వర్డు మరి ఓటిపిలను ఎవరితోనో పంచుకోవద్దని మొబైల్ వాడకంలో తగు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం, నవంబర్ 20:** రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో ఆరు నెలల బ్యూటీషియన్ (క్రాఫ్ట్) కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురంలోని సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు ఎర్రగుంట్ల గజలక్ష్మి, ఓబిరెడ్డి గురువారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. అయితే వయో పరిమితి లేదని వివరించారు. శిక్షణ కాలం పూర్తయ్యాక అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్బీ టెట్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు సెల్: 90597 23829/15690 33379 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## సిమెంట్ టాంకర్ బోల్తా

**- డ్రైవర్‌కు స్వల్పగాయాలు**




**తొండూరు – సూర్య వాస్తవం, నవంబర్ 20:** తొండూరు మండలం మల్లేల గ్రామానికి సమీపంలో గురువారం సాయంత్రం సిమెంట్ టాంకర్ లారీ బోల్తా పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. యర్రగుంట్ల నుంచి బెంగళూరుకు సిమెంట్‌ను తరలిస్తున్న లారీ మలుపు వద్ద అతివేగంతో వెళ్లడం వల్ల నియంత్రణ కోల్పోయి రోడ్డుపక్కకు ఒరిగి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. తోటి డ్రైవర్లు స్పందించి అతడిని వెంటనే పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ బోల్తా కారణంగా కొంతసేపు రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. అయితే పోలీసులు, గ్రామస్థులు కలిసి వెంటనే మార్గం క్లియర్ చేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గ్రామస్థులు మాట్లాడుతూ, "ఈ మలుపు వద్ద లారీలు తరచూ అతివేగంగా రావడం వల్ల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వేగనియంత్రణ చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

# విస్తృతంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు




**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, నవంబర్ 20:** అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసాపేట హై స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మార్కెట్ ఉర్దూ ఉన్నత పాఠశాల, దపేదార్ పల్లి ఉర్దూ హై స్కూల్,కొత్తపల్లి ఉర్దూ హైస్కూల్ లలో ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వారికి ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన టెట్ పరీక్షపై ఉపాధ్యాయులు ఎటువంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. టెట్ పరీక్ష పై ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లామని, ఉపాధ్యాయులకు నిర్వహించే టెట్ పరీక్షపై సాధ్య సాధ్యాలను సమీక్షించాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఏవైనా సమస్యలను విద్యాశాఖ అధికారులకు చెప్పుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు మండల విద్యాశాఖ అధికారులు, 5 నుండి 6 గంటల వరకు జిల్లా విద్యాశాఖ అధికారులు తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ విజయరామరాజు మెమో విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధ్యాయులందరికీ వారి సమస్యలు పరిష్కారమై ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు మడితాటి నరసింహారెడ్డి, కొండూరు మురళీ మోహన్రాజు, వెంకట్రామరాజు, నల్లమల రామానుజులు, వాలూనాయక్, పాలగిరి పక్కీరా, రాయచోటి మండల అధ్యక్షులు గోవింద, నాగరాజు, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్, సంబేపల్లి మండల అధ్యక్షులు గౌనిపల్లి రెడ్డన్న, మండల నాయకులు నాగరాజు నాయక్, బలరామరాజు, నరేంద్ర, నాగరాజు, శివరామరాజు, ఆసిఫ్, వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కమిషన్ల కోసం కక్కుర్తి పడడం ఆదినారాయణ రెడ్డి నైతికత

**- పులివెందుల ప్రజలు రిటర్న్ గిఫ్ట్‌తో ఆదినారాయణ రెడ్డికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి**

**- బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వైఖరిపై వైసీపీ నాయకుల మండిపాటు**



**పులివెందుల – సూర్య వాస్తవం, నవంబర్ 20:** కమిషన్ కోసం కక్కుర్తి పడి ప్రత్యర్థులపై దాడులు చేసే నైతికత ఆదినారాయణ రెడ్డిది అని, రిటర్న్ గిఫ్ట్‌తో ఆదినారాయణ రెడ్డికి పులివెందుల ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పులివెందుల వైకాపా నాయకులు ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డారు. గురువారం పులివెందులలోని జగన్ క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి పట్టణ ఉపాధ్యక్షుడు వానపల్లి కిషోర్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవినాష్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి ఆదినారాయణ రెడ్డికి లేదని, రాష్ట్రం లో ఎన్ని రాజకీయ పార్టీలు ఉంటే అన్ని పార్టీల కండువాలు మార్చిన ఊసరవెల్లి అవినాష్ రెడ్డి గురించి మాట్లాడటం సిగ్గుచేటని, నువ్వు సూది నారాయణవా లేక సుత్తి నారాయణవా అనేది నీ ఇంట్లో వాళ్ళ చెబుతారని, భూపేష్ కు ఇచ్చే విలువ కూటమి ప్రభుత్వం నీకు ఇవ్వడం లేదనే ఫ్రస్ట్రేషన్ లో పిచ్చి పట్టి కారు కూతలు చూస్తున్నారని, వై.యస్.భారతి గురించి పదేపదే విషపు కూతలు కూస్తే ఆదినారాయణ రెడ్డి చరిత్ర హీనుడిగా నిలిచిపోతాడని, సొంత ఇంట్లో నుంచి సొంత కూటమి లో పార్టీల నాయకుల వరకు శృతిమించిన ఆగడాలతో ప్రతి ఒక్కరి చీత్కారాలతో చీదరింపులతో కచ్చితంగా వినాశనం, విధ్వంసం కాక తప్పదని, ఆర్టీపీపీ ఫ్లయాష్, అదానీ, సెయిల్ కంపెనీలలో మోటార్లు, జనరేటర్ దొంగతనాలు, తాళ్ళ ప్రొద్దటూరు లో పోలీస్ స్టేషన్ కు కేటాయించిన కోట్ల విలువ చేసే స్థలాన్ని కబ్జా చేయడం పలు సిమెంట్ ఫ్యాక్టరీలలో, కాంట్రాక్టర్ ల దగ్గర నువ్వు, నీ అనుచరులు దందాలకు, కమిషన్‌ల కోసం కక్కుర్తి పడి దాడులు చేసే నీకు అవినాష్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు, పులివెందుల ప్రజల గురించి పులివెందుల ప్రాంతం గురించి పదే పదే హేళనగా మాట్లాడే నువ్వు మొన్న ర్యాలీకి వచ్చిన జనాన్ని చూసి భయంతో పులివెందుల వాళ్ళు మంచి వాళ్ళు గొప్పవాళ్ళు అంటూ యూ టర్న్ రాజకీయాలు చేస్తున్నావ్, వైయస్ కుటుంబం పులివెందుల ప్రజలు వేరు వేరు కాదు, నీకు దమ్ము లేకనే పులివెందుల ప్రజలను బూత్ ల్లోకి రాకుండా ప్రజల ఓట్లు దొంగలించి జెడ్పీ గెలిచామని సంబరాల కంటే రాష్ట్ర స్థాయిలో ఇలాంటి గెలుపు ఎందుకని ప్రజలందరూ భావిస్తున్నారని ఇప్పటికైనా విజ్ఞతతో కూడిన రాజకీయాలు చేయాలి తప్పితే దిగజారుడు రాజకీయాలు సరికావని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు హేమాద్రి రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ కుటుంబాల సమస్యల పరిష్కారమే చైతన్య వేదిక లక్ష్యం



**వేంపల్లి – సూర్య వాస్తవం, నవంబర్ 20:** రాష్ట్రములో వున్న బ్రాహ్మణ కుటుంబాల సమస్యలు ను ప్రభుత్వ దృష్టికి తీసుకోనిపోయి వాటి పరిష్కారం కోసం కృషి చేయడమే చైతన్య వేదిక లక్ష్యం అని బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులు పీవీయెస్ వి ప్రసాదరావు సూగురు రఘునాథరావు లు తెలిపారు. వేంపల్లి లో విలేకరుల తో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత జరిగిన ఎన్నికలులో తెలుగుదేశం గెలుపు కోసం రాష్ట్రం లో కృషి చేసిన నాయకులు తో బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకుడుడొక్కా జగన్నాధం బాబు సిరిపురం శ్రీధర్ శర్మలు 2014 నవంబర్ 20 వ తేదీన గుంటూరులో సమావేశం ఏర్పాటు చేసారని నేటికీ పుష్కర కాలం అయిందని నేటి వరకు బ్రాహ్మణ సమస్య లు ధ్యేయం గా తెలుగుదేశం గెలుపే లక్ష్యం గా బ్రాహ్మణ చైతన్య వేదిక పని చేస్తూ వున్నదని అన్నారు.

2014 డిసెంబర్ 5వ తేదీ న సమావేశం తర్వాత కార్పొరేషన్ ఏర్పాటు పై వేదిక సీనియర్ నాయకులు నాగబాబు శ్రీధర్ తదితరులు ముఖ్యమంత్రి ని కలిసి వినతి పత్రం ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత కార్పొరేషన్ ఏర్పాటు విధి విధానాలు ప్రకటించిన తర్వాత కార్పొరేషన్ ప్రాధాన్యత బ్రాహ్మణ కుటుంబాలు కు ఏ విధంగా ఉపయోగ పడుతుందనే విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య వేదిక ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2019-24 మధ్య కార్పొరేషన్ నిర్వీర్యం అయిందని అయిన రాష్ట్రం లో బ్రాహ్మణ సమస్య లపై పత్రిక పోరాటం చేసిన సంఘం చైతన్య వేదిక అన్నారు. 2024ఎన్నికలు తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం లోకివచ్చిన తర్వాత కార్పొరేషన్ పూర్తి ఏర్పాటు చేసారని ఇప్పుడు బ్రాహ్మణ సమస్యలను పరిష్కరించడానికి కార్పొరేషన్ పూర్తి స్థాయిలో పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యమైన సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టి కి తీసుకొని పోయే బాధ్యత కార్పొరేషన్ పాలకమండలి దే నని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని సామజిక పెన్షన్ తల్లికి వందనం స్త్రీ శక్తి పథకం అమలు ప్రశంసనీయం అని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్న కూటమి ప్రభుత్వం కు బ్రాహ్మణులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని బ్రాహ్మణ కుటుంబాలకు ప్రస్తుత ప్రభుత్వం లోనే మేలు జరుగుతుందని తెలిపారు.

## బొజ్జ మైసూరా రెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలకరింపు



**పులివెందుల – సూర్య వాస్తవం, నవంబర్ 20:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కడప జిల్లా పర్యటనలో భాగంగా ఎయిర్పోర్ట్‌లో కడప జిల్లా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డిని ఆత్మీయంగా పలకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రైతాంగ సంక్షేమం కోసం చేపట్టిన పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా కడప జిల్లా కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం పెండ్లిమర్రిలో ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంలో పాల్గొన్నందుకు కడప ఎయిర్పోర్టుకు చేరుకోగా పలువురు ప్రముఖులు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకగా అదే కోవలో బొజ్జ మైసూరా రెడ్డిని చిరునవ్వుతో పలకరించి ముందుకెళ్లారు.

## ఏపీ ఎన్జీవో నాయుడుపేట యూనిట్‌కి కొత్త కార్యవర్గం ఎన్నిక




**నాయుడుపేట – సూర్య వాస్తవం, నవంబర్ 20:** ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ – నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయుడుపేట తాలూకా యూనిట్‌కు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా అడ్‌హాక్ కమిటీ చైర్మన్ పి. సురేష్ బాబు ఆదేశాల మేరకు గురువారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఎలక్షన్ అధికారి ఎస్.వి. శ్రావణ్ కుమార్, అబ్జర్వర్ లలిత్ కుమార్ పర్యవేక్షణలో ఎన్నికలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనవారిలో తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా కె.ఆనంద్ కుమార్, సెక్రటరీగా వి.వి. శ్రావణ్‌కుమార్, ట్రెజరర్‌గా కౌశిక్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఉమెన్ జాయింట్ సెక్రటరీగా మేరీ సుకన్య, జాయింట్ సెక్రటరీలుగా సరిత, సంజీవయ్య, బాలకోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా రాజేష్, సయ్యద్ బాబు, అనిల్ కుమార్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గం నియామకాన్ని తాలూకా యూనిట్ అధ్యక్షుడు కె.ఆనంద్ కుమార్ వెల్లడించారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



**పులివెందుల – సూర్య వాస్తవం, నవంబర్ 20:** పులివెందుల గ్రంథాలయంలో వారం రోజులు పాటు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గురువారం పులివెందుల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (అహోబిలాపురం)లో విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పులివెందుల మండల విద్యా శాఖ అధికారి చంద్ర శేఖర్ రావు, మండల విద్యా శాఖ అధికారి -2 రామా నాయుడులు విచ్చేసి విద్యార్థులకు గ్రంథాలయాల విశిష్టత గురించి, గ్రంథాలయం ఉపయోగాలు గురించి చక్కగా వివరించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులను కృష్ణ కిషోర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, లక్ష్మి రెడ్డి, అశోక్, అన్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

### పుట్టపర్తి శత జయంతి ఉత్సవాల్లో

# భాగస్వామిని కావడం పూర్వ జన్మ సుకృతం





**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం, నవంబర్ 20:** పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయి బాబ శత జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించే క్రమంలో మంత్రి కందుల దుర్గేష్ భాగస్వామి అయ్యారు. ఏపీ ప్రభుత్వం సత్యసాయి శత జయంతి ఉత్సవాల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో మంత్రి కందుల దుర్గేష్ సభ్యుడు కావడంతో పరిశీలన బాధ్యతలు చేపట్టి భక్తులకు అందుతున్న ఏర్పాట్లను సహచర మంత్రులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 23వ తేదీ వరకు పుట్టపర్తిలోనే ఉండి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించనున్నారు. మానవాళిలో అధ్యాత్మికత, శాంతి, సమాజసేవను పెంపొందించేందుకు శ్రీ సత్యసాయి చేసిన ప్రయత్నాలను భావితరాలకు అందించే కార్యక్రమంలో పాలు పంచుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ కు శాంతి భవన్ లో సహచర మంత్రులు ఎస్.సవిత, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్ లు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీత, స్థానిక ప్రజా ప్రతినిధుల స్వాగతం. మంత్రులంతా కలిసి సత్యసాయి బాబ శత జయంతి ఉత్సవాలకు పుట్టపర్తికి విచ్చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎయిర్ పోర్ట్ లో ఘన స్వాగతం పలికారు. అనంతరం దగ్గరుండి వేడుకల ప్రత్యేకతను వివరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆప్యాయంగా పలకరించి సంభాషించు కున్నారు. అదే విధంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మంత్రి దుర్గేష్ ను కోరి వినతి పత్రం అందించారు. దారిలో వెళుతుండగా పెదపల్లి గ్రామంలో అయ్యప్ప భక్తులు మంత్రి దుర్గేష్‌ను సత్కరించారు.

# సేవకు మారుపేరు శ్రీ సత్యసాయి భగవాన్





**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం, నవంబర్ 20:** సమాజంలో సేవకు నిలువెత్తు రూపం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా అని కేంద్ర మంత్రి నితిన్ గట్కరి అభిప్రాయపడ్డారు. సాయికుల్వంత హాల్లో జరిగిన సభలో భారత దేశ రహదారులు, రవాణా శాఖకు మంత్రి అయిన నితిన్ గడ్కరీ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా బోధనల ప్రభావంతో తన హృదయాన్ని తాకిన అనుభూతులను పంచుకున్నారు. ముందుగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ కేంద్ర మంత్రివర్యులకు సాదర స్వాగతం పలికారు. రాష్ట్ర మంత్రివర్యులు కందుల దుర్గేష్ కూడా స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులనుద్దేశించి మాట్లాడుతూ, తాను ఎవరినీ బోధించటానికి రాలేదని, ఇక్కడి భక్తి, విలువలు, సేవా భావాన్ని చూసి ఇంకా ఎక్కువ మంచి పని చేయడానికి ప్రేరణ పొందటానికే వచ్చానని నితిన్ గడ్కరి వినమ్రంగా తెలిపారు. సరళతను ప్రధానంగా ప్రస్తావిస్తూ, తాను ఇంజనీరు కానీ సాంకేతిక నిపుణుడు కానీ కాదని, మంచి విద్య, సత్సంగతి, సత్ప్రవర్తన ౦ ఇవే ఒక మనిషిని ఉత్తముడిగా తీర్చిదిద్దే మహత్తర గుణాలు అని అన్నారు. జీవితంలో శాంతి ఎంతో ముఖ్యమని, శాంతి ఉన్నచోట సమస్యలు సహజంగానే పరిష్కారాలు పొందుతాయని చెప్పారు. మనకు అవసరమైన దానికంటే ఎక్కువదే భగవంతుడు ప్రసాదించాడని, వర్తమానంలో జీవిస్తే ఆనందం లభిస్తుందని, భవిష్యత్తుపై ఆందోళన పెంచుకుంటే అసాంతి పెరుగుతుందని గుర్తుచేశారు. ఒక ప్రముఖ వ్యక్తి మాటలను స్మరించుకుంటూ, "ఆకలితో ఉన్న వ్యక్తికి ఆధ్యాత్మికతను బోధించకండి. ముందుగా సేవ చేయండి," అని చెప్పారు. మంచి ఆలోచనలు అన్నింటినీ మార్చగలవని, విజ్ఞానాన్ని సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా సంపదగా మార్చగలిగితేనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని వివరించారు. చివరగా, భగవాన్ శ్రీ సత్య సాయి బాబా జీవితం, ఆయన బోధించిన విలువలు మానవాళిని నెరవెంట నడిపిస్తూ, మంచి పనులు చేయడానికి నిరంతరం ప్రేరణనిస్తూనే ఉంటాయని తెలిపారు.

# వృద్ధాశ్రమంలో వైద్య సేవలు



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, నవంబర్ 20:** పత్తికొండ పట్టణం హొసూరు రోడ్డులోని రూరల్ ట్రైబల్ డెవలప్మెంట్ సొసైటీ వృద్ధాప్య ఆశ్రమంలో ఉంటున్న వారికి స్పెషలిస్ట్ వైద్యులచే వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించినారు. అనంతరం రాష్ట్రీయ బాల స్వాస్త్య కార్యక్రమ సమన్వయకర్త, అసంక్రామిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్.మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ వయస్సు పెరిగేకొద్దీ సంతోషంగా జీవించాలి కాబట్టి పెద్దలను కుటుంబ సభ్యులు అప్యాయతతో, ప్రేమతో పలకరిస్తే వారు సంతోషంగా ఉంటారని తెలిపారు. వృద్ధులలో ఆరోగ్య సమస్యలు వినికిడి లోపము, దృష్టి సమస్యలు, కిళ్ల నొప్పులు, మధుమేహం, గుండెజబ్బులు, జ్ఞాపకశక్తి సమస్యలు, దంత సంబంధ సమస్యలు, మానసిక సమస్యలు, మలబద్ధకం, మూత్ర సంబంధ సమస్యలు, భోజనం చేసిన సరిగ్గా జీర్ణం కాకపోవడము లాంటి సమస్యలు ఉంటాయని తెలిపారు. వైద్యులను కలుసుకుంటే ఇబ్బందులను అధిగమించవచ్చునని అన్నారు. మానసిక వైద్యులు డాక్టర్. చైతన్య ఈ వయస్సులో వచ్చే మానసిక సమస్యల గురించి అవగాహనా కల్పించినారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులచే 25 మందికి వైద్య పరిక్షలు, రొమ్ము, ఓరల్, గర్భషాయ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినారు, అవరమైన వారికి నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ వ్యాధి నిపుణులు కల్పనా, జనరల్ మెడిసిన్ మమతా ప్రియా, ఆర్థో వైద్యులు డాక్టర్. రాఘవ నాయుడు, కంటి వైద్య నిపుణులు డాక్టర్. జాహ్నవి, దంత వైద్య నిపుణులు డాక్టర్. రవికిరణ్. మానసిక నిపుణులు డాక్టర్. చైతన్య, హనుమంత రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి సాయిబాబా, సామాజిక ఆరోగ్య అధికారులు రవికుమార్, మౌనిక, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు ప్రకాష్, వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు శ్రీకళ, చైతన్య కుమారి, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## పూరిల్లు దగ్ధమైన సుబ్బమ్మకు జనసేతల సాయం

### - బాధితురాలి పట్ల పరామర్శ



**నాయుడుపేట – సూర్యా వాస్తవం, నవంబర్ 20:** నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంటలో గ్యాస్ సిలిండర్ పేలడంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న యానాది సుబ్బమ్మకు జనసేన పార్టీ నేతలు ఆదుకోవడానికి ముందుకు వచ్చారు. గురువారం నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో పలువురు జనసేతలు లోతువానిగుంటకు చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ జనసేన నాయకుడు అట్ల కృష్ణారావు తన వంతు సాయంగా పది వేల రూపాయల నగదు అందజేశారు. బాధితురాలిని ఆశ్వాసపరిచిన ఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, ప్రభుత్వపరమైన అన్ని విధాల సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వినుకొండ ధనంజయ, సరసమ్మ, కోకిల, జనసేన నాయకులు గిండి సతీష్, బాలిశెట్టి, శేఖర్, శ్రీను, మున్నా, జనసేన వీర మహిళలు రోహిణి, సల్మా, జ్యోతిష్ పాల్గొన్నారు.

## సీనియర్ నేత, కాంట్రాక్టర్ జలదంకి మధుసూదన్ రెడ్డి ఇకలేరు



**నాయుడుపేట – సూర్య వాస్తవం, నవంబర్ 20:** నాయుడుపేట పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, ప్రముఖ కాంట్రాక్టర్ జలదంకి మధుసూదన్ రెడ్డి (62) గురువారం సాయంత్రం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ప్రాణాలు విడిచారు. ప్రముఖ కాంట్రాక్టర్‌గా అత్యున్నత నిర్మాణాల ద్వారా మంచి గుర్తింపు పొందిన మధుసూదన్ రెడ్డి పినాకిని అతిథిగృహం, కండలేరు జలాశయ అతిథి గృహాలను అన్ని సౌకర్యాలతో నిర్మించి కాంట్రాక్టర్ వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నాయుడుపేట మండలంలో నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడిగా ప్రజల్లో ఆదరణ పొందిన ఆయన మరణం ప్రాంత ప్రజలను విషాదంలో ముంచేసింది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నాయుడుపేట గాంధీ పార్కు వెనుక ఉన్న మాతృశ్రీ అపార్ట్మెంట్‌లోని వారి నివాసం నుండి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

## జీవితంపై విరక్తి కలిగి ఉరి వేసుకొని మహిళ మృతి



**పులివెందుల – సూర్య వాస్తవం, నవంబర్ 20:** జీవితంపై విరక్తి కలిగి షేక్ పర్వీన్ (37) అనే మహిళ ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన పులివెందులలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు పులివెందులకు చెందిన పర్వీన్ కు టిప్పు సుల్తాన్ అనే వ్యక్తితో నాలుగు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరు హైదరాబాదులో కాపురం ఉంటున్నారు. పర్వీన్ సాఫ్ట్వేర్ ఇంజనీరుగా విధులు నిర్వహించేది. పర్వీన్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేది. అయితే పర్వీన్ తన భర్త టిప్పు సుల్తాన్‌తో మనస్పర్ధలతో రెండు రోజుల క్రితం జేఎన్టీయూలో విధులు నిర్వహిస్తూ, కళాశాల క్వార్టర్స్‌లో ఉన్న తన సోదరి తాజ్ ఇంటికి వచ్చింది. ఒకపక్క ఆరోగ్య సమస్యలు మరోపక్క భర్తతో మనస్పర్ధలు ఉండడంతో జీవితంపై విరక్తి కలిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందింది. విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన తన సోదరి ఎంతసేపటికి తలుపు తీయకపోవడంతో చుట్టుపక్కల ఉన్న వాళ్ల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా పర్వీన్ అప్పటికే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ సీతారామిరెడ్డి ఎస్ఐ సుబహాన్ లు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



## వేధిస్తున్న నీటి సమస్య

**- తక్షణమే స్పందించిన అధికారులు**

**- వార్డు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు**



**పులివెందుల – సూర్య వాస్తవం, నవంబర్ 20:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని రాఘవేంద్ర స్వామి గుడి సమీపంలోని కాలనీలో నీరు సక్రమంగా సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. గత 20 రోజులుగా నీరు సక్రమంగా సరఫరా కాలేదని, నీరు ఎప్పుడు విడుదల చేస్తారో తెలియడం లేదని, నీటి కోసం పనులు మానుకోవాల్సి వస్తోందని, మూడు నాలుగు రోజులకు ఒకసారి అర్ధరాత్రి వేలల్లో నీరు సరఫరా చేసినా సక్రమంగా నీరు అందడం లేదని, నీటి కోసం రాత్రులు మేలుకోవాల్సి వస్తుందని, అయినా నీరు అందడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మా కాలనీకి నీరు సక్రమంగా అందేలా చూడాలన్నారు.

**స్పందించిన అధికారులు:** నీటి సమస్య పరిష్కరించిన మున్సిపల్ ఇంచార్జ్ వయసు మనోహర్ రెడ్డి: బ్రాహ్మణపల్లి గ్రామం లో నీటి సమస్య ఉన్నదని తెలియచేసిన గంట వ్యవధిలోనే బోర్ లో క్రొత్త మోటార్ వేయించి సమస్యను పరిష్కరించిన వైఎస్ మనోహర్ రెడ్డి, చైర్మెన్ వరప్రసాద్, కౌన్సిలర్ మహేష్ రెడ్డి నీటి సమస్య ను వెనువెంటనే పరిష్కరించిన వైఎస్ మనోహర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలు



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, నవంబర్ 20:** పత్తికొండ మహమ్మదీయ మస్జిద్ ప్రెసిడెంట్ సాద్దీన్ నూర్ బాషా మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ మైసూర్ సుల్తాన్ మరియు "మైసూర్ టైగర్" అని కూడా పిలుస్తారు. అతను తన తండ్రి హైదర్ అలీ తరువాత 1782లో సుల్తాన్ అయ్యారు మరియు బ్రిటీష్‌తో అనేక యుద్ధాలు చేసారు అని ముఖ్యంగా మైసూరు యుద్ధాలు. సైనిక సంస్కరణలలో అతను రాకెట్ ఫిరంగి దళానికి మార్గదర్శకులు మరియు అతను కొత్త క్యాలెండర్, నాణేలు మరియు పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టారు అని తెలియచేసారు.మహమ్మదీయ మస్జిద్ మౌలానా హాబిబుల్ల గారు మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ 1750 నవంబర్ 20న దేవనహళ్లిలో జన్మించారు 1782లో తండ్రి మరణం తరువాత, అతను మైసూర్ సుల్తాన్ అయ్యారు. టిప్పు సుల్తాన్ బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా చాలా యుద్ధాలు చేశారు, వీటిలో రెండవ మైసూరు యుద్ధం ముఖ్యమైనది. అని టిప్పు ఇనుప కేస్డ్ రాకెట్లను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు, ఇది యుద్ధ రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చింది అని అన్నారు. పరిపాలనా సంస్కరణలు: టిప్పు కొత్త క్యాలెండర్‌ను, కొత్త నాణేలను ప్రవేశపెట్టారు. పరిపాలనలో అనేక సంస్కరణలను తెచ్చారు దీనివల్ల రైతులు లబ్ధి పొందారు. సంస్కృతి, **మతం:** అతను ఒక కవి మరియు భాషా పండితుడు. అతను ఫ్రెంచ్ వారి కోరికపై మైసూరులో ఒక చర్చిని నిర్మించారు. అతను శ్రీరంగపట్నంలో స్వేచ్ఛా వృక్షాన్ని (ట్రీ ఆఫ్ లిబర్టీ) నాటారు.

**మరణం:** టిప్పు సుల్తాన్ 1799 మే 4 న శ్రీరంగపట్నం వద్ద బ్రిటీష్‌తో జరిగిన యుద్ధంలో మరణించారు.అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, మహబూబ్ బాషా, యువత పాల్గొని ఘనంగా నిర్వహించారు.

## రిటైర్డ్ టీచర్ మృతి



**కదిరి – సూర్య వాస్తవం, నవంబర్ 20:** తలుపుల మండలం గంజివారిపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కదిరిసాని వెంకటరమణ ఏటన్న అయ్యవారు (83) ఈరోజు బోయపల్లి లోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచాడు. ఈయన గతంలో ఈదులకుంట్లపల్లి, జ్యోతి వాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ల్లో పనిచేసే కొత్త పూలవాండ్లపల్లి లో పదవీ విరమణ చేశాడు. అంత్యక్రియలు గంజి వారి పల్లి గ్రామంలో రేపు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

### లేపాక్షిని అంతర్జాతీయ

# పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

**- మంత్రి కందుల దుర్గేష్**

**- లేపాక్షికి యునెస్కో శాశ్వత గుర్తింపునకు చర్యలు తీసుకుంటామని, త్వరలో లేపాక్షి ఉత్సవాలు జరుపుతామని వెల్లడి**

**- పుట్టపర్తి, లేపాక్షి, కదిరిలోని ప్రఖ్యాత ఆలయాలను టెంపుల్ సర్క్యూట్ గా అభివృద్ధి చేస్తామని హామీ**

**- 16 నెలల కాలంలో పర్యాటక రంగంలో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని స్పష్టం**



**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం, నవంబర్ 20:** లేపాక్షిని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని,యునెస్కో గుర్తింపును శాశ్వతం చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలోని చారిత్రక లేపాక్షి క్షేత్రాన్ని మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికంగా కొలువై ఉన్న శ్రీ వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అద్భుత కళా, శిల్ప సంపదతో అలరారుతోన్న లేపాక్షి క్షేత్రం యునెస్కో తాత్కాలిక వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కించుకుందన్నారు. ఇక్కడ దాదాపు 450 – 500 ఏళ్ల క్రింద నిర్మించిన శ్రీ వీరభద్ర స్వామి ఆలయం అద్భుత శిల్ప కళా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆలయం అణువణువులోనూ అద్భుత గాధ ఇమిడి ఉందన్నారు. పురాణ, ఇతిహాసాలను తెలియజెప్పే విధంగా నాటి శిల్పకళా నైపుణ్యంతో చెక్కిన శిల్ప సౌందర్యం అందరికీ అద్భుత అనుభూతిని కల్పిస్తుందన్నారు. ఇలాంటి ప్రాంతాలను కేవలం సందర్శించడమే కాదు అనుభూతిని ఆస్వాదించే స్థాయిలో పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎన్నో అద్భుత కట్టడాలు ఉన్నాయన్నారు. వాటన్నింటిని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. లేపాక్షి శ్రీ వీరభద్ర స్వామి ఆలయం, కదిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, పుట్టపర్తి సత్యసాయిబాబ నిలయంతో పాటు స్థానికంగా ఉండే ప్రకృతి సౌందర్య ప్రదేశాలనన్నింటిని కలిపి టెంపుల్ సర్క్యూట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. ఒకరోజు దర్శనానికి వచ్చే పర్యాటకుడు రెండు మూడు రోజులు ఉండేలా చేయాలన్నదే పర్యాటక శాఖ లక్ష్యమన్నారు. ఈ క్రమంలో పర్యాటకులకు వసతి కల్పనకు హోటల్స్, రిసార్ట్స్ ను పీపీపీ విధానంలో అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. పలు పర్యాటక ప్రాంతాల్లో ఎకో, టెంపుల్, హెలీ, అగ్రి,అడ్వెంచర్ తదితర విభిన్న టూరిజం ప్రక్రియలను అభివృద్ధి చేసి టూరిజం హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇన్వెస్టర్లకు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన సీఐఐ సమ్మిట్ లో రూ.17 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులు సాధించామని, గడిచిన 15 నెలల కాలంలో రూ. 12 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని మొత్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పర్యాటక రంగంలోనే దాదాపు రూ.30 వేల కోట్ల పర్యాటక పెట్టుబడులు ఆకర్షించామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రపంచంలోనే ఏపీని పర్యాటకుల ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామన్నారు. భారతీయ శిల్పకళా వైభవానికి, విజయనగర సామ్రాజ్య నిర్మాణ నైపుణ్యానికి లేపాక్షి క్షేత్రం నిలువెత్తు నిదర్శనమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మీడియాతో ముఖాముఖిలో తెలిపారు. ప్రధానంగా ఆలయ ప్రాంగణంలోని అద్భుతమైన ఏకశిలా నంది విగ్రహం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గాలిలో వేలాడే స్తంభం,ఆలయ పైకప్పుపై వేసిన అపురూపమైన కుడ్య చిత్రాలు మన పూర్వీకుల గొప్ప సాంకేతిక పరిజ్ఞానాన్ని, కళాత్మక వారసత్వాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించాయని పేర్కొన్నారు. ఈ విలువైన చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం పర్యాటక రంగానికి ఏటా రూ.7 కోట్ల రెవెన్యూ ఇచ్చే హరిత రిసార్ట్స్ స్థానంలో రుషికొండ లాంటి రాజప్రాసాదాన్ని కట్టి పర్యాటక శాఖ రాబడిని దెబ్బతీశారన్నారు. పైపెచ్చు తాము అదనంగా ఏటా కోటి రూపాయలు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ క్రమంలో పీపీపీ విధానంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసి ఆదాయాభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. అదే క్రమంలో యువతకు ఉపాధి కల్పనకు చొరవ తీసుకుంటున్నామన్నారు. గడిచిన ఐదేళ్లలోని ప్రభుత్వం లేపాక్షి ఉత్సవాలను జరపలేదని తాము త్వరలోనే లేపాక్షి ఉత్సవాలను జరుపుతామన్నారు. ఇప్పటికే తాము పర్యాటకులను ఆకర్షించేలా ఫ్లెమింగో ఫెస్టివల్,అరకు బెలూన్ ఫెస్టివల్, బీచ్ ఉత్సవాలు, విజయవాడలో దసరా ఉత్సవాలు నిర్వహించామన్నారు. ప్రస్తుతం పుట్టపర్తిలో శ్రీ భగవాన్ సత్యసాయి బాబ శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పర్యాటక రంగానికి ఉజ్వలమైన భవిష్యత్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

# ఇంతటి దుర్మార్గమైన పాలనను ఎక్కడ, ఎన్నడూ చూడలేదు

**- సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్‌తో ములాఖత్ అయిన వైఎస్ఆర్‌సిపి నాయకులు**



**నెల్లూరు – సూర్యవాస్తవం, నవంబర్ 20:** నెల్లూరు సెంట్రల్ జైల్లో మాజీ మంత్రి జోగి రమేష్‌ని, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ తో కలిసి వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఎలాంటి తప్పు చేయని జోగి రమేష్, జైల్లో ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, త్వరలోనే ఆయన తన నిర్దోషితత్వాన్ని నిరూపించుకొని, జైలు నుంచి బయటకు వస్తారని వైసిపి నేతలు తెలిపారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జోగి రమేష్ ఎంతో ధైర్యంగా ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు.జగన్మోహన్ రెడ్డి తో కలిసి,పోరాడే క్రమంలో ఇలాంటి అక్రమ కేసులు.. ఎన్నింటినైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని జోగి రమేష్ చెప్పారని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి..వై సి పి నేతలపై ఒకే పద్ధతిలో అక్రమ కేసులు బనాయిస్తూ జైలుకు పంపుతుందన్నారు. ఎవరో ఒకరి వద్ద నుంచి అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయడం.. వైసిపి నేతలపై అక్రమ కేసులు బనాయించడం టిడిపి నేతలకు పరిపాటిగా మారిందన్నారు.ఈ రోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఎవరైతే.. కూటమినేతల అక్రమాలను, దౌర్జన్యాలను బలంగా ప్రశ్నిస్తున్నారో.. వారిని టార్గెట్ గా చేసుకొని ఈ అక్రమ అరెస్టులు జరుగుతున్నాయన్నారు. ఇలా అక్రమ అరెస్టులు చేసి,మిగిలిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు.. గురి చేయడం, కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇంతటి దుర్మార్గమైన పాలనను ఎక్కడ ఎన్నడూ చూడలేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఈ రాష్ట్రంలో 11 సీట్లు వచ్చినప్పటికీ.. వైఎస్ జగన్మోహన్ రెడ్డి రెండో రోజు నుంచే.. ఈ రాష్ట్రంలో ప్రజలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడాలని, మాకు అందరికీ సూచించడం జరిగిందన్నారు. ఇలా అక్రమ కేసులు నమోదు చేస్తే.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలెవరు బెదిరిపోరని.. ప్రజా సమస్యల పట్ల ప్రశ్నిస్తూనే ఉంటారని తెలిపారు.ప్రజలందరూ కూటమి పాలన పై విసుగు చెంది ఉన్నారని.. ఈ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని జగన్మోహన్ రెడ్డి ని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు.. ఏ చిన్న కార్యకర్తకు ఇబ్బంది వచ్చినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జగన్మోహన్ రెడ్డి పదేపదే తెలియజేస్తున్నారని అన్నారు.ఈరోజు జోగి రమేష్ కుటుంబానికి కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్ని విధాల.. అండగా ఉంటుందని.. తప్పకుండా ఈ కేసు నుంచి జోగి రమేష్ నిర్దోషిగా బయటపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854